హైదరాబాద్
9-9-2023
సంపుటి:08
సంచిక: 353
పేజీలు: 4
వెల: రూ.5/-

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## అడ్వర్టైజ్ కమిటీని ఏర్పాటు చేసి అక్రిడిటేషన్ కమిటీతో అనుసంధానం చేయాలి

### ఐజేయు అధ్యక్షులు కే. శ్రీనివాస్ రెడ్డి





**హైదరాబాద్: సెప్టెంబర్ 8** అక్రిడిటేషన్ కమిటీ తో పాటు అడ్వర్టైజ్మెంట్ కమిటీని ఏర్పాటుచేసి అనుసంధానం చేసి కొత్తగా కమిటీని ఏర్పాటు చేయాలని ఐజేయు అధ్యక్షులు కే. శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా అవలంబిస్తున్న ఈ పద్ధతిని ప్రవేశపెట్టడం వల్ల పత్రికలకు ప్రకటనలు విడుదల చేయడంలో పారదర్శకత ఉంటుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులు, చిన్న దినపత్రికలు, మ్యాగజైన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలతో సంబంధం లేకుండా దుర్మార్గమైన పాలన ప్రస్తుతం నడుస్తుండడం దురదృష్టకరమన్నారు. ఈ పరిపాలన అసలు ఊహించ లేనిది.. ఇక దీని అవసరం కూడా లేదని అన్నారు. నియంతృత్వ పోకడలతో ఉన్న ఈ ప్రభుత్వాన్ని అందరూ సమన్వయంతో ఐక్య పోరాటంతో ఎదుర్కోవాలని సూచించారు. చిన్న మధ్య తరహా పత్రికల సంపాదకుల పోరాటాలకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ చిన్న పత్రికల సంపాదకుల పోరాటం కీలకమైందన్నారు. ప్రస్తుతం తెలంగాణ వచ్చాక చిన్న పత్రికలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమన్నారు. సమాచార శాఖకు కేటాయించిన నిధులు అసలు ఎక్కడికి పోతున్నాయని, సంవత్సర కాలం నుండి చిన్న పత్రికలకు బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. చిన్న పత్రికల సంపాదకులు తమ పోరాటాలను ఉదృతం చేయాలని టి యు డబ్ల్యూ జె మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ సతీష్ కమల్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ అణచివేత ధోరణిని అందరూ ముక్తకంఠంతో ఖండించాలని పేర్కొన్నారు. ఆప్ పార్టీ ప్నాయకులు న్యాయవాది మహమూద్ అలీ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే మనం మన హక్కులను సాధించుకోగలమని.. పత్రికా స్వేచ్ఛ ఉంటేనే ప్రజాస్వామ్యం బతుకుతుందని చెప్పారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న చిన్న పత్రికల ఆందోళన కార్యక్రమాలకు మా అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని హెచ్ యు జె అధ్యక్షుడు శంకర్ అన్నారు. చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు మాట్లాడుతూ చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న గ్రేడింగ్ సమస్యలు... సమయానికి బిల్లులు చెల్లింపు జరగకపోవడం..అక్రిడిటేషన్లు ఇవ్వడంలో జరుగుతున్న వివక్ష తదితర అంశాలను రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించారు. తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు దయానంద్, ఉప ప్రధాన కార్యదర్శి అశోక్, అక్తర్ హుస్సేన్, యూసుఫోద్దీన్ ఖాద్రీ, వెంకటయ్య, అఫ్రోజ్ ఖురేషి, నీలకంఠేశ్వర్ రెడ్డి, నసీరుద్దీన్ ఖాద్రీ, ఖాసీం, మాధవరెడ్డి, సాజిదా సికిందర్, రామకృష్ణ, అమన్, షాహిద్, సందేశ్, బాషా, మొహిసిన్అలీ, పద్మనాభ రావ్ తదితరులు పాల్గొన్నారు.

**ఐ జె యు అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి...విరాహత్ అలీలకు సన్మానం**

నిరంతరం చిన్న పత్రికల సంఘానికి భరోసానిస్తూ... భుజం తడుతూ ముందుకు నడిపిస్తున్న ఐజేయూ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీలను ఈ సందర్భంగా చిన్న పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఉప ప్రధాన కార్యదర్శి అశోక్ లు సన్మానించారు. నూతనంగా ఆధునీకీకరించిన టియుడబ్ల్యూజే - ఐ జే యు కార్యాలయంలో చిన్న పత్రికల సంఘానికి ప్రత్యేకంగా ఆఫీసును కేటాయించినందుకు చిన్న పత్రికల సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

## కలం గెలిచింది

### ఫలించిన సమ సమాజం పత్రిక ఎడిటర్ పోరాటం



- కుల అహంకారులకు బుద్ధి చెప్పిన హైకోర్టు
- చలమల్ల పై అట్రాసిటీ కేసునమోదు
- తనకు వ్యతిరేకంగా వార్తలు రాశాడని సమ సమాజం దిన పత్రిక చీఫ్ ఎడిటర్, జర్నలిస్ట్ పృథ్వీరాజ్ ను ఫోన్ లో దూషించిన కృష్ణారెడ్డి...
- అభ్యంతరకర పోస్టులు, కులం పేరుతో అవహేళన చేశాడని హైకోర్టు లో బాధితుడి ఫిర్యాదు
- ఫిర్యాదు మేరకు చలమల్ల కృష్ణారెడ్డి పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమ సమాజం):** చట్టానికి ఎవరు చుట్టం కారని, ధనికులు పేదవారు అనే తేడా ఉండదని మరోసారి రుజువైంది. ఇటీవల జర్నలిస్టు పృధ్వీరాజ్ ను బెదిరిస్తూ, కులం పేరుతో దూషణలకు పాల్పడిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి పై ఎట్టకేలకు కేసు నమోదయింది. తనకు వ్యతిరేకంగా వార్తలు రాశాడని కక్ష సాధింపు చర్యలకు పాల్పడినారు. దీనితో పోలీసులను ఆశ్రయించిన జర్నలిస్టు పృధ్వీరాజ్ కు న్యాయం జరగకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. కేసును స్వీకరించిన ధర్మాసనం చలమల కృష్ణారెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సమ సమాజం పత్రిక ఎడిటర్ జర్నలిస్ట్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాజకీయాలను నిశితంగా పరిశీలిస్తున్న జర్నలిస్టుగా విశ్లేషణాత్మక వార్త కథనాలను ప్రచురించినందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల కృష్ణారెడ్డి నాపై దుర్భాషలాడుతూ, కులం పేరుతో దూషించాడని, ఓ ఛానెల్ ఇంటర్వ్యూలో నా పేరు ప్రస్తావిస్తూ, కులాన్ని ప్రస్తావిస్తూ, వృత్తిని అవమానించారు. అంతటితో ఆగకుండా వసూల్ రాజా అంటూ సోషల్ మీడియాలో ఫోటోను మార్ఫు చేసి సామాజికంగా, ఆర్థికంగా కృంగదీసే కుట్ర పన్నాడు. వీటన్నిటిని తగు ఆధారాలతో హాయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని అన్నారు. నెలరోజులుగా కేసు నమోదు కాకుండా జాప్యం చేయడంతో హైకోర్టును ఆశ్రయించానని, తగిన ఆధారాలను పరిశీలించిన కోర్టు 504,506 IPC, 3(1)() SC ST POA ACT 2015, 3(2)(va) SC ST POA ACT< కింద కేసు నమోదు చేయాలని తెలంగాణ పోలీసును ఆదేశించింది. హైకోర్టు సూచన మేరకు బుధవారం హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసింది అని తెలిపారు. డబ్బు అహంకారంతో కులం పేరుతో దూషిస్తే ఊరుకునేది లేదని, శిక్ష పడేదాకా న్యాయపోరాటం చేస్తామని జర్నలిస్టు పృథ్వీరాజ్ అన్నారు. అన్ని రంగాల్లో, అన్ని వ్యవస్థల్లో అనగారిన వర్గాలపై కులవివక్ష ఉందని, జర్నలిస్టులపై కూడా కొందరు రాజకీయ నాయకులు కుల వివక్ష చూపుతున్నారని ఇలాంటి రుగ్మతలను తిప్పికొట్టాలని, ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని హితవు పలికారు.



## అర్ధరాత్రి కలకలం

### చంద్రబాబును అరెస్ట్ చేస్తారని పెద్దఎత్తున ప్రచారం

నంద్యాలలో హైటెన్షన్

అంగళ్లు ఘటనలో ఏ-1గా టీడీపీ అధినేత

హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసు

20 మందిపై నమోదు

బస వద్ద పోలీసుల మోహరింపుతో సందేహాలు

అరెస్ట్ ప్రచారంతో తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

నేడు, రేపు కోర్టులకు సెలవులు.. అందుకే


అరెస్ట్‌కు శుక్రవారం అర్ధరాత్రి ముహూర్తం?

ఎలాగైనా బాబును జైలులో పెట్టాలని కుట్ర!!



2లో

## దేశంలో వ్యవస్థలపై దాడి



మైనారిటీలు, దళిత వర్గాలపై దౌర్జన్యాలు

భారత్‌లో హింస, వివక్ష పెరిగిపోతున్నాయి

రష్యా-ఉక్రెయిన్ వివాదంలో కేంద్ర ప్రభుత్వ వైఖరితో ఏకీభవిస్తున్నాం: బ్రస్సెల్స్‌లో రాహుల్



## టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల

- 5,089 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి
- ఈ నెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష
- రూ.1,000కి పెరిగిన ఫీజు
- తక్కువ పోస్టుల భర్తీపై నిరుద్యోగుల నిరసన

హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల

# సంపాదకీయం




## ఏ వెలుగులకు ఈ 'ఏకత్వం'?

మీరు అమితంగా పట్టించుకునే ఒక సమస్య గురించి చెప్పండి? ఎంతో మంది స్త్రీ పురుషులకు నేను ఈ ప్రశ్న వేశాను. ఇంచుమించు ప్రతీ ఒక్కరూ తాము ఎక్కువగా పట్టించుకునేది, తమను అమితంగా కలవరపరుస్తున్న ఒక సమస్య లేదా విషయం గురించి మాత్రమే కాకుండా రెండు లేదా మూడింటి గురించి చెప్పారు. ఇది అర్థం చేసుకోదగినదే. మరి ఒక మాతృమూర్తి (గృహిణి) కేవలం ద్రవ్యోల్బణం గురించి మాత్రమే ప్రస్తావించి, తన బిడ్డ భద్రతను ఎలా ఉపేక్షిస్తారు? ఒక పారిశ్రామిక కార్మికుడు ఉద్యోగ భద్రత గురించి మాత్రమే చెప్పి, తన నివాస ఇరుగు పొరుగు ప్రదేశాలలో పెచ్చరిల్లుతున్న మూక హింసాకాండను ఎలా విస్మరిస్తాడు? వివాహం చేసుకోదలిచిన యువ ప్రేమికులు తమ తల్లిదండ్రుల అనుమతి విషయమై సందేహాలను మాత్రమే పేర్కొని నైతిక పోలీసు బృందాల సంభావ్య దాడులపై భయాందోళనలను వ్యక్తం చేయకుండా ఎలా ఉంటారు భారత ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యల వైనాన్ని ఆ సమాధానాలు విశదం చేస్తున్నాయి.. ఈ సమస్యలు శతాబ్దాల నుంచి కాకపోయినా దశాబ్దాల నుంచి ఉన్నాయనడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. అటువంటి నిర్దయతకు ఇదీ నా స్పందన: 'ఇంతకు ముందున్న సమస్యలు ఇక ముందూ కొనసాగుతూ తీవ్రమయితే స్వాతంత్ర్యం, స్వపరిపాలన కోసం మూడుతరాల వారు ఎందుకు పోరాడినట్టు?' ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కొరకు ఉన్న ప్రభుత్వమే ఆదర్శ, ఆవశ్యక ప్రభుత్వమనే విషయం గత 250 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా ఆమోదనీయమవుతోంది. ఒక దేశం అభివృద్ధి శిఖరాలు అధిరోహించాలన్నా, సంపద్వంతం కావాలన్నా, మానవ హక్కులను సంపూర్ణంగా పొందాలన్నా, మత స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలన్నా, సాంస్కృతిక పురోగతి సాధించుకోవాలన్నా, సమానత్వం, సౌభ్రాతృత్వంతో విలసిల్లాలన్నా దేశానికి తప్పనిసరిగా, పైన ప్రస్తావించిన తరహా ప్రభుత్వం ఉండి తీరాలన్నదే ప్రతీ ఒక్కరి సునిశ్చిత విశ్వాసంగా ఉన్నది. ఈ లక్ష్యాల సాధన అనేది ఒకే ఒక్క జాతి ప్రజలకు మాత్రమే పరిమితమైన జపాన్ నుంచి అనేక జాతుల సమ్మేళనమైన అమెరికా, భారత్ దాకా ప్రతీ సమాజానికి ఒక బృహత్తర సవాల్‌గా ఉన్నది. సమైక్య ప్రజల యొక్క, నిస్వార్థపరులచేత, సమస్త ప్రజల కొరకు పాలనా కృషి చేసే ప్రభుత్వాన్ని కలిగివుండడమనే ఒకే ఒక్క మార్గంలో మాత్రమే ఆ సవాల్‌ను సమర్థంగా ఎదుర్కోగలమని నేను భావిస్తున్నాను. బ్రిటిష్ పార్లమెంటరీ నమూనాను భారత్ అనుసరిస్తోంది. బహుళ మతాలు, భాషలు, సంస్కృతులతో అపార వైవిధ్యంతో అలరారుతున్న భారత్ లాంటి దేశం ప్రపంచంలో మరొకటి లేదు. ఈ దేశంలోని వివిధ జాతుల, మతాల, కులాల, భాషల, ప్రజలకు సముచిత ప్రాతినిధ్యమిచ్చేందుకు పార్లమెంటరీ వ్యవస్థ కంటే మేలైన ప్రభుత్వ విధానం లేదు. బ్రిటిష్ నమూనానే భారత్‌కు ఇప్పటికీ ఉత్తమ మార్గమని నేను విశ్వసిస్తున్నాను. ప్రస్తుత పాలకులు బీజేపీ, దాని మిత్రపక్షాలు, ప్రచ్ఛన్న మద్దతుదారులు– పూర్తిగా విరుద్ధ నమూనాను ప్రతిపాదిస్తున్నారు. భారతీయులు అందరూ ఒకే జాతి ప్రజలుబీ వారి మధ్య ఉన్న వ్యత్యాసాలు అన్నిటినీ ఆ ఏకత్వంలో కలిపివేసేయాలి. ఈ ఏకత్వ వాదనకు చరిత్రగానీ, గత 75 ఏళ్ల అనుభవాలు గానీ దృష్టాంతాలుగా లేవన్న వాదనను వారు కొట్టివేస్తున్నారు. ఈ ఏకత్వ సిద్ధాంతాన్ని భాష, ఆహారం, వస్త్రధారణ, సాంఘిక ప్రవర్తనారీతులకు, చివరకు వ్యక్తిగత (మత) చట్టాలకు, ఆచారాలకు కూడా విస్తరించారు. భాష విషయాన్నే తీసుకోండి. బీజేపీ శ్రేణుల తొలి, మలి, తుది ప్రాధాన్యాలు హిందీయే సుమా! ఈ దేశంలో హిందీకంటే బాగా పురాతనమైన, సమగ్ర వ్యాకరణం, సమున్నత సాహిత్యమున్న భాషలు అనేకమున్నాయన్న వాస్తవాన్ని బీజేపీవారు విస్మరిస్తున్నారు. అలాగే వస్త్రధారణ విషయంలో అధిక సంఖ్యాక వర్గాల వారి నిర్దేశాలనే పాఠశాల బాలలు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాటించితీరాలి. హాస్టళ్లలో మాంసాహారం నిషిద్ధం. కులాంతర, మతాంతర వివాహాలను అనుమతిస్తున్న చట్టాలను మెజారిటీవాద ఆజ్ఞలు త్రోసిపుచ్చుతున్నాయి. యువతీ యువకుల సాంఘిక ప్రవర్తనను క్రమబద్ధీకరించేందుకు నైతిక పోలీసు బృందాలకు ఉచిత లైసెన్స్ ఉన్నది! ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) మైనారిటీ మతస్తుల, ఆదివాసీల ఆచారాల, వ్యక్తిగత చట్టాలను రద్దు చేస్తుంది.

## దేశంలో వ్యవస్థలపై దాడి

లండన్, సెప్టెంబరు 8: భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలపై పూర్తిస్థాయి దాడి జరుగుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. వ్యవస్థలను అణచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై యూరోపియన్ యూనియన్(ఈయూ) వర్గాల్లోనూ ఆందోళనలు ఉన్నాయని చెప్పారు. యూరప్ పర్యటనలో భాగంగా బ్రస్సెల్స్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాస్తవానికి భారత్‌లో మైనారిటీలతో పాటు దళిత, గిరిజన, నిమ్న వర్గాలు కూడా దాడులకు గురవుతున్నాయని, దేశ స్వభావాన్నే మార్చేసే ప్రయత్నం జరుగుతోందని రాహుల్ ఆరోపించారు. రష్యా–ఉక్రెయిన్ వివాదంపై కేంద్ర ప్రభుత్వ వైఖరితో ప్రతిపక్షాలు ఏకీభవిస్తున్నాయని చెప్పారు. పెద్ద దేశమైన భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు ఉండటం సహజమేనన్నారు. జి–20 సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం మంచి విషయమని, అయితే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ఆహ్వానం అందకపోవడం జనాభాలో 60% మందికి ప్రాతినిధ్యం వహించే నాయకుడికి విలువ ఇవ్వని బీజేపీ ప్రభుత్వ ఆలోచనా ధోరణికి అద్దం పడుతోందని రాహుల్ అన్నారు. భారత్‌లో హింస, వివక్ష పెరిగిపోతున్నాయని, దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలపై పూర్తిస్థాయిలో దాడులు జరుగుతున్న విషయం అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఈ అంశాలపై యూరోపియన్ పార్లమెంటేరియన్లు కూడా చాలా ఆందోళనగా ఉన్నారని, వారు కూడా తమ వాదనతో ఏకీభవించారని తెలిపారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఈ అంశంలో ఇతరులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాగా, జి–20 సదస్సు నేపథ్యంలో దేశం పేరు మార్పుపై సామాజిక మాధ్యమాల్లో చర్చ చెలరేగి భయాందోళనలకు దారితీయడం అంతా సమస్యను పక్కదారి పట్టించే ఎత్తుగడని రాహుల్ గాంధీ అన్నారు.

# జీడీపీపై దొంగ లెక్కలు!




దేశీయోత్పత్తి (జీడీపీ) పరంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎసవో) 'వాస్తవాలను దాచిపెడుతోంది' అని అశోకా మోదీ స్పష్టం చేశారు. కేవలం ఎంపిక చేసుకున్న డేటానే పరిగణనలోకి తీసుకొని భారత దేశ 'వృద్ధి'గా చూపుతోందని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు 'ప్రాజెక్టు సిండికేట్' కోసం తాను రాసిన ప్రత్యేక వ్యాసంలో ఆ వివరాలను ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లోని తొలి త్రైమాసికమైన ఏప్రిల్–జూన్ మధ్య జీడీపీ వృద్ధి రేటు 7.8శాతంగా ఉందని కేంద్రం పేర్కొంది. దీన్నే అశోకా మోదీ తన వ్యాసంలో ప్రస్తావిస్తూ తప్పుబట్టారు. మరిన్ని ప్రధాన గణాంకాలను ఎన్ఎసవో పరిగణనలోకి తీసుకుంటే తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 4.5 శాతానికి మాత్రమే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. జీడీపీ వృద్ధి రేటును లెక్కించే క్రమంలో ఎన్ఎసవో దేశీయ ఆదాయాన్నే పరిగణనలోకి తీసుకొందని, వ్యయాన్ని లెక్కలోకి తీసుకోలేదని అశోకా మోదీ పేర్కొన్నారు. దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తుసేవల ద్వారా వచ్చిన రాబడిని ఆదాయ ఖాతా కింద.. వీటిని కొనేందుకు దేశ ప్రజలు, విదేశీయులు వెచ్చించే సొమ్మును వ్యయఖాతా కింద పరిగణిస్తారు. దీన్నే అశోకా మోదీ ప్రధానంగా తన వ్యాసంలో ప్రస్తావిస్తూ.. ఆదాయ ఖాతా, వ్యయ ఖాతా సరి సమానంగా ఉండాలన్నారు. "తమ ఉత్పత్తులను వినియోగదారులు కొన్నప్పుడే కదా ఉత్పత్తిదారులు ఆదాయాన్ని ఆర్జించేది?" అని వ్యాసంలో రాశారు. వస్తుసేవల ఉత్పత్తుల ద్వారా వార్షిక ఆదాయ వృద్ధి తొలి త్రైమాసికం ఏప్రిల్–జూన్ మధ్య 7.8శాతానికి పెరిగిందని, అయితే వ్యయ వృద్ధి మాత్రం 1.4శాతంగానే ఉందన్నారు.

ఎన్ఎసవో మాత్రం ఆదాయం తాలూకు గణాంకాలనే పరిగణనలోకి తీసుకుందని అశోకా మోదీ పేర్కొన్నారు. ఇది "అంతర్జాతీయంగా ఉన్న అత్యుత్తమ ప్రమాణాలను ఉల్లంఘించడమే"నని ఆయన అన్నారు. దేశ ప్రజలు ఇబ్బందుల్లో ఉండటం, దేశీయ వస్తుసేవల కొనుగోలు విషయంలో విదేశీయులు పరిమిత ఆసక్తిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ఆర్థిక వ్యయంపై ఎన్ఎసవో 'వాస్తవాలను దాచిపెడుతోంది' అని ఆయన దుయ్యబట్టారు. అయితే ఆదాయ ఖాతా, వ్యయ ఖాతాకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా తేడాలు ఉంటాయని.. ఇందుకు అసంపూర్తి డేటానే కారణం అని అశోకా మోదీ నొక్కి చెప్పారు. ఆదాయ, వ్యయ ఖాతాల పరంగా ఉన్న తేడాలను గుర్తించి.. మొత్తంగా డేటాను పరిగణనలోకి తీసుకున్నప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థపై ఓ అంచనాకు రాగలం అని చెప్పారు. దీన్నే ఆస్ట్రేలియా, జర్మనీ, బ్రిటన్ దేశాలు అనుసరిస్తున్నాయని చెప్పారు. వాస్తవానికి తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7.8శాతంగా ఉందని కేంద్రం చెప్పడంపై పలువురు ఆర్థికవేత్తలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆర్థికవేత్త అశోకా మోదీ విశ్లేషణ ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా అశోకా మోదీ వాదనపై కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ స్పందించారు. జీడీపీ వృద్ధి కోసం వ్యయాల డేటాను కాకుండా రాబడుల పరమైన డేటానే పరిగణనలోకి తీసుకుని లెక్కించే విధంగా భారత్‌లో సులభమైన డేటా విధానం అమల్లో ఉందని పేర్కొన్నారు.

# టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. వాస్తవానికి ఈ నెల 5వ తేదీనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రూపొందించినప్పటికీ గోప్యంగా ఉంచిన విద్యాశాఖ, గురువారం అర్ధరాత్రి వెల్లడించింది. శాఖలో 22 వేల వరకూ ఖాళీలున్నప్పటికీ, కేవలం 5,089 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నట్టు వెల్లడించింది. 1,523 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల ఖాళీలను కూడా భర్తీ చేస్తామని గతంలో ప్రకటించినా నోటిఫికేషన్‌లో ఆ ఖాళీలను ప్రస్తావించలేదు.స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలు, భాషా పండితుల పోస్టులను భర్తీ చేస్తున్నట్టు తెలిపింది. తొలిసారిగా ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్)లో పరీక్షను నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు దశల వారీగా పరీక్ష ఉంటుందని తెలిపారు.

**గరిష్ట వయోపరిమితిని 44 ఏళ్లు..**

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం నల్లగొండ, సంగారెడ్డిలో పరీక్ష కేంద్రాలుంటాయని ప్రభుత్వం పేర్కొంది. అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 44 సంవత్సరాలుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ళు, దివ్యాంగులకు పది సంవత్సరాల వయో పరిమితి సడలింపు ఇస్తారు. అయితే ఈసారి టీఆర్టీ ఫీజును రూ.200 నుంచి రూ.1,000కి పెంచారు. పరీక్ష ఆన్‌లైన్‌లో పెడుతున్న కారణంగా ఫీజు పెంచినట్టు అధికారులు తెలిపారు.

ఈ నెల 20 నుంచి అక్టోబర్ 20 మధ్య ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. ఉత్తీర్ణతకు ఓసీలు 90, బీసీలు 75, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు 60 మార్కులు తెచ్చుకోవాలి. టెట్ మార్కుల్లో 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టీఆర్టీలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రతి పోస్టుకు ముగ్గుర్ని ఎంపిక చేస్తారు. వారి మార్కులు ఇతర మెరిట్స్ ఆధారంగా అందులో ఒకరిని ఎంపిక చేస్తారు. కాగా పూర్తి సమాచారం ఈ నెల 20వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

పాఠశాల విద్యాశాఖలో 22 వేల పోస్టులున్నాయని గత ఏడాది విద్యాశాఖ తెలిపింది. ఇందులో 13,086 పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. ప్రస్తుతం టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపడుతున్నారు. దీనివల్ల కొన్ని ఖాళీలు ఏర్పడతాయి. వీటిని కూడా కలిపి ఎక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇస్తారని నిరుద్యోగులు భావించారు. కానీ 5,089 పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ జారీ చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. మరోవైపు కేవలం 2 నెలల వ్యవధిలోనే పరీక్ష నిర్వహిస్తుండటంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు కూడా ఆర్నెల్ల సమయం ఇస్తున్న సర్కార్, టీఆర్టీని ఇంత త్వరగా పెట్టడం ఏమిటని నిరుద్యోగులు అంటున్నారు.

## చైనాకు చెక్ పెడదాం!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించినట్లయ్యింది. వచ్చే ఏడాది భారత్ నిర్వహించనున్న క్వాడ్ నేతల శిఖరాగ్ర సమావేశాలకు బైడెన్‌ను మోదీ ఆహ్వానించారు. ఇండో–పసిఫిక్ ఒషెన్స్ ఇనిషియేటివ్ (ఐపీఓఐ)లో చేరాలన్న అమెరికా నిర్ణయాన్ని మోదీ స్వాగతించారు. మోదీ, బైడెన్ ద్వైపాక్షిక భేటీ అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన వెలువడింది. నేతల చర్చలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను ఈ ప్రకటనలో వెల్లడించారు. ఆ వివరాలు.. ఇరు దేశాల ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య ఉన్నతస్థాయి సంబంధాలను కొనసాగించాలి. తద్వారా భారత్–అమెరికా ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలి. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్‌కు, ప్రపంచ అభివృద్ధికి తోడ్పడాలి. ఆర్థికరంగంలోనేగాక ఇరుదేశాల ప్రజల మధ్య కూడా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయటం ద్వారా ప్రపంచంలో మంచి మార్పులకు భారత్, అమెరికా చోదకశక్తులుగా పని చేయాలి.అంతరిక్ష పరిశోధనల రంగంలో పరస్పర సహకారాన్ని కొనసాగించాలి. వచ్చే ఏడాది అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రానికి (ఐఎసఎస్) ఇరు దేశాలు కలిసి వెళ్లే ప్రతిపాదనను మరింత ముందుకు తీసుకెళ్లాలి. ఈ ఏడాది ఆఖరుకు మానవ సహిత అంతరిక్ష యాత్రను కలిసి చేపట్టటంపై కసరత్తును కొనసాగించాలి. రక్షణ రంగంలో పరస్పర సహకారానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా రోదసి, కృత్రిమ మేధో రంగాలకు భారత్–అమెరికా రక్షణ భాగస్వామ్యాన్ని విస్తరించాలి. భారత సైన్యానికి రిమోట్‌తో నడిపించే నిఘా విమానాలను అందించే ప్రతిపాదనపై అమెరికా పరిశీలన జరుపుతుంది. జీఈ ఎయిరోస్పేస్, హెచ్ఏఎల్ సంయుక్తంగా భారత్‌లో జీఈ ఎఫ్–414 యుద్ధవిమానాల ఇంజిన్ల తయారీని చేపడుతాయి. రక్షణరంగంలో ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవటానికి స్టార్టప్‌లను అభివృద్ధి చేయాలి. అణుశక్తి రంగంలో పరస్పరం కలిసి పని చేయాలి. భారత్‌లో పునరుత్పాదక ఇంధనాల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. దీంట్లో భాగంగా భారత్‌లో పదివేల ఎలక్ట్రిక్ బస్సుల తయారీకి చర్యలు. పునరుత్పాదక వనరుల వినియోగాన్ని ప్రోత్సహించటానికి అమెరికా, భారత్ చెరో 50 కోట్ల డాలర్లతో నిధిని ఏర్పాటు చేస్తాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేలా డబ్ల్యూటీవో చివరి, ఏడవ వివాద పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. టెక్నాలజీ రంగంలో భారత్ సాధిస్తున్న విజయాల నేపథ్యంలో, కీలకమైన, కొత్తగా ఆవిర్భవిస్తున్న టెక్నాలజీల విషయంలో పరస్పరం సహకరించుకోవాలి. ముఖ్యంగా పరస్పర విలువలను, ప్రజాస్వామ్య సంస్థలను పునాదిగా చేసుకొని 'ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ' (ఐసెట్)పై దృష్టి పెట్టాలి. ఐసెట్‌పై వచ్చే ఏడాది ప్రారంభంలో సమీక్ష జరపాలి. గ్లోబల్ సెమికండక్టర్ పంపిణీ వ్యవస్థల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. టెలికాం రంగంలో 5జీ, 6జీ టెక్నాలజీల అభివృద్ధిపై ఇరుదేశాల కంపెనీలు పరస్పరం సహకరించుకునేలా చర్యలు చేపట్టాలి.

## అర్ధరాత్రి కలకలం

అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు ను అరెస్ట్ చేయనున్నారంటూ శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా కలకలం రేగింది. నంద్యాలలో చంద్రబాబు బస చేసిన ఫంక్షన్ హాల్ వద్ద పోలీసులు భారీగా మోహరించడంతో అరెస్ట్ చేయవచ్చన్న వార్తలకు బలం చేకూరింది. పోలీసు ఉన్నతాధికారులు అదనపు బలగాలను నంద్యాలకు పంపనున్నారన్న వార్తలతో మరిన్ని అనుమానాలు పెరిగాయి. అరెస్ట్ ప్రచారం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. నంద్యాలలో చంద్రబాబు బస చేసిన ఫంక్షన్ హాల్ వద్దకు టీడీపీ శ్రేణులు భారీగా చేరుకున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు కడప, అనంతపురం జిల్లాల నుంచీ తరలివెళ్లారు. ఐటీ నోటీసుల కేసులో చంద్రబాబును అరెస్ట్ చేస్తారని మొదట ప్రచారం జరిగింది. అయితే ఐటీ శాఖ నుంచి షోకాజ్ నోటీసు మాత్రమే వచ్చినందున అరెస్ట్ చేసే అవకాశం లేదని, అన్నమయ్య జిల్లా అంగళ్లు దాడి ఘటనలో ఆయన్ను అరెస్ట్ చేస్తారని అర్ధరాత్రికి స్పష్టత వచ్చింది. దీనిపై పోలీసు అధికారులు ఎవరూ అధికారికంగా స్పందించకున్నప్పటికీ చంద్రబాబు అరెస్టకు జగన్ ప్రభుత్వం పావులు కదుపుతున్న తీరు కుట్రపూరితంగా ఉంది. అరెస్టకు శుక్రవారం అర్ధరాత్రి ముహూర్తంగా ఎంచుకోవడం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోందని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అంగళ్లు ఘటనలో చంద్రబాబు ఏ1గా ఉండటం, ఆయనపై హత్యాయత్నం కేసు (307) సహా తీవ్ర అభియోగాలు నమోదైన నేపథ్యంలో అర్ధరాత్రి అరెస్టకు ముహూర్తంగా ఎంచుకోవడానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఎందుకంటే శని, ఆదివారాలు కోర్టుకు సెలవు. కేసులో మోపిన అభియోగాల తీవ్రత దృష్ట్యా మేజిస్ట్రేట్ ఇంటి వద్ద చంద్రబాబును హాజరు పరిచినా అప్పటికప్పుడు ఎంత వరకు రిలీఫ్ లభిస్తుందనేది సందేహమే. మేజిస్ట్రేట్ నుంచి చంద్రబాబుకు ఊరట లభించకుంటే శని, ఆదివారాలు జైలులో ఉంచాలన్నది జగన్ సర్కారు ఉద్దేశమని చెబుతున్నారు.

శుక్రవారం అర్ధరాత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా నంద్యాలకు తరలివచ్చారు. రెండు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, టీడీపీ కీలక నాయకులు నంద్యాలలో చంద్రబాబు విడిది చేసిన ఆర్కే ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. రాత్రి 12 గంటల సమయంలో చంద్రబాబు ఉన్న బస్సులోకి బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బీసీ జనార్దన్ రెడ్డి వెళ్లి వచ్చారు. ఆయన మినహా మరెవరూ చంద్రబాబు బస చేసిన బస్సులోకి వెళ్లలేదు. అయితే చంద్రబాబుకు జెడ్ ప్లస్ భద్రత ఉన్న నేపథ్యంలో పోలీస్ ఎస్కార్ట్ ఆయన వెంటే ఉన్నారు. ఏది ఏమైనా చంద్రబాబును అరెస్టు చేయడానికి వస్తే అడ్డుకునేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావడంతో నంద్యాలలో హైటెన్షన్ నెలకొంది. మదనపల్లె, సెప్టెంబరు 8: సెప్టెంబరు 4న అంగళ్లులో జరిగిన దాడి ఘటనకు సంబంధించి అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ముదివేడు పోలీస్ స్టేషన్‌లో చంద్రబాబుతో పాటు మొత్తం 20 మందిపై కేసు నమోదైంది.

# మహిళలు స్వయంకృషితో ఎదగాలి

**అడిషనల్ కలెక్టర్ బి. ఎస్. లత**



**జగిత్యాల టౌన్/ సమ సమాజం:**మహిళలు స్వయంకృషితో ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లతా పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని సుమంగళి గార్డెన్స్ లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన మెగా రుణ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ బి. ఎస్. లత హాజరయ్యారు. ఈసందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా రుణ మేళా నిర్వహించి వివిధ మహిళా సంఘాల సభ్యులకు వారి అర్హత మేరకు విరివిగా త్వరితగతిన రుణాలు మంజూరు చేయడం సంతోషమన్నారు. అలాగే బ్యాంకు ద్వారా రుణాలు పొంది రీపేమెంట్ చేయడంలో 99 శాతం ఉందని రాబోవు రోజుల్లో 100 శాతం రీపేమెంట్ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని మెప్మా , సెర్ప్ సిబ్బందికి సూచించారు.తీసుకున్న రుణాలను అందరూ సద్వినియోగము చేసుకోవాలని.. అంతేకాకుండా ప్రతి ఒక్క మహిళా సంఘం అనే కాకుండా వీలైనంత వరకు ప్రతి ఒక్క మహిళ తమకు నచ్చిన రంగంలో పెట్టుబడి పెట్టి యూనిట్ ప్రారంభించి తాము ఉపాధి పొందడమే కాకుండా మరి కొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ శంకర్ హేంబ్రం మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా మహిళలకు సంబంధించి మహిళా సంఘాల రుణాలతో పాటు ప్రత్యేకంగా కూడా పలు పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వ్యాపారం ప్రారంభించి మరికొంత మందికి ఉపాధి కల్పించే దిశగా ప్రయత్నించే మహిళలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. యూనియన్ బ్యాంక్ అందించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.శుక్రవారం నిర్వహిస్తున్న మెగా రుణ మేళాలో ఆరు బ్రాంచిలకు సంబంధించిన పట్టణ, గ్రామీణ ప్రాంతానికి చెందిన 205 మహిళా, స్వశక్తి సంఘాలకు గాను 21 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకట్ రెడ్డి, ఛీఫ్ మేనేజర్ సరళ్ గుప్తా, జిల్లా ఎఫ్ ఎల్ సీ కోట మధు సూదన్, మెప్మా ఏఓ శ్రీనివాస్, యూబీఐ వివిధ శాఖల మేనేజర్లతో పాటుగా సెర్ప్ ఏపిఎంలు, సిసిలు, వీఓఏలు, మెప్మా టిఎంసీ, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ పౌరసమాజం ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి లక్ష్యం

**జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత**



**జగిత్యాల, సమ సమాజం:** తెలంగాణ రాష్ట్రంలోని పౌరసమాజం,ప్రతి గ్రామాలలోని ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉండాలనేదే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు లక్ష్యమని జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల జిల్లా లోని అన్ని గ్రామాలలో డెంగ్యు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టి ప్రతి పౌరుడు ఆరోగ్యంగా వుండే వాతావరణం కల్పించాలని అధికారులను చైర్ పర్సన్ దావా వసంత ఆదేశించారు. జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయములో శుక్రవారం దావ వసంత అధ్యక్షతన జిల్లా అధికారులచే గూగుల్ మీట్ నిర్వహించారు.

ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని గ్రామాలలో భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలలో వృధా నీరు,మురుగు నీరు నిలిచిపోవడం , ఇండ్లలోని పాత సామనులలో నీరు నిల్వ వుండడం వలన అందులో నివాసం ఏర్పారుచుకొన్న దోమల వలన మలేరియా,డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలటకు ఆవకాశం ఉన్నందున,ప్రజలకు ట్రాక్టర్ ను గ్రామాలోని అన్ని వీధులలో వాయిస్ రికార్డర్ ద్వారా మరియు డప్పు చాటింపు ద్వారా అవగాహన కల్పించుటకు తగు చర్యలు చేపట్టాలని డి.పి.ఓ. అధికారులను ఆదేశించారు. తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు కేసిఆర్ సమర్థ మార్గదర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాకరంగా రూపుదిద్దుకొన్న పల్లె ప్రగతి కార్యక్రమములో భాగంగా జగిత్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రజాపతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతంలో ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా భావించి అంటువ్యాధులు, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా తగుచర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.జిల్లాలోని చాల గ్రామాలలో రోడ్డు పైన నీరు నిలువ ఉంటున్నాయని వెంటనే గుర్తించి నీరు నిలివ ఉండకుండా తగు చర్యలు చేపట్టుటకు సంబందిత ప్రజాపతినిధులు, డి.ఎల్.పి.ఓ., యం.పి.డి.ఓ.లు, యం.పి.ఓ.లను, గ్రామ పంచాయతి కార్యదర్శులను భాగస్వామ్య పరచుటకు తగు సూచనలను జారీచేయాలని డి.పి.ఓ ను ఆదేశించారు .జిల్లాలోని గ్రామాలలో ఇదివరకు నాటిన చైనా బాదం మొక్కల స్థానంలో కానుగ లేదా వేప మొక్కలతో మార్పు చేయాలని ఆమె సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో వర్షాకాలమును దృష్టిలో ఉంచుకొని ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లే విధంగా ప్రత్యేక దృష్టి వహించి విషజ్వరాలు,అంటు వ్యాధులు ప్రభలకుండా గ్రామ పంచాయితీ సిబ్బంది అప్రమత్తం చేసి ప్రజలను అవగాహన పరిచి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతి అధికారిని కోరారు,ఆశా వర్కర్లు మరియు ఏ.ఎన్.యం.లు గ్రామ ప్రజలకు అంటు వ్యాధులుపట్ల,ఇంట్లో వ్యర్థంగా పడివున్న టైర్లలో,పాత్రలలో పరిసర ప్రదేశములలో నీరు నిలువ ఉండకుండా ప్రజలను అప్రమత్త పరచి కాచి వడబోసిన నీటినే త్రాగాలని అవగాహన పరచే విధంగా ఆదేశములు జారి చేయుటకు డి.యం.హెచ్.ఓ. శ్రీధర్ ను ఆదేశించారు.కాగా వర్షాకాలం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో జడ్పీ చైర్ పర్సన్ చర్చించారు. సమీక్షా సమావేశము లో శ్ పి.నరేష్, సి.ఈ.ఓ., డి.ఆర్.డి.ఓ,డి.పి.ఓ. ఓ.దేవరాజ్ , డి.యం. హెచ్.ఓ. డా.పి.శ్రీధర్,జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఏ శ్రీనివాస్ , జిల్లా ఇరిగేషన్ ఆఫీసర్ రమేష్ , యం.పి.డి.ఓ.లు,యం.పి.ఓ.లు, ఏ.పి.ఓ.ఏ.పి.యం.లు పాల్గొన్నారు.

# పరాయి దేశం పాలనలో మోసపోయాం

**మళ్లీ పట్టణ పాలనకు అవకాశం ఇవ్వద్దు**

**పరోక్షంగా ఎమ్మెల్యే రమేష్ బాబు లక్ష్మీనరసింహారావు పై ఆది విమర్శలు**



**చందుర్తి, సమ సమాజం:**పరాయి దేశం పాలనలో మోసపోయామని అదేవిధంగా మళ్లీ పట్టణ పాలనకు అవకాశం ఇవ్వకూడదని పరోక్షంగా ఎమ్మెల్యే రమేష్ బాబు లక్ష్మీ నరసింహారావు ను కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం చందుర్తి ఐజేయు ప్రెస్ క్లబ్బులో ఆయన విలేకరులతో చిట్ చాట్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గం లో ఎమ్మెల్యే రమేష్ బాబు అభివృద్ధి పనులు చేయకుండా జర్మనీలో ఉంటున్నాడని పరాయి పాలన చేస్తూ వేములవాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు. వేములవాడ ఆలయానికి అభివృద్ధి కోసం కోట్ల రూపాయలను ఇస్తున్నామని గొప్పలు చెప్తూ ఒక్క రూపాయి ఇవ్వకుండా కనీస అభివృద్ధి చేయలేదన్నారు. 2005లో మల్యాల గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి 1700 కోట్ల రూపాయలతో ఇక్కడి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తే ఇప్పటి వరకు లచ్చ పేట రిజర్వాయర్లు పూర్తి చేయలేదని అన్నారు. ఒకరు పోతే ఒకరు వచ్చినట్లుగా కరీంనగర్ పట్టణానికి చెందిన చెలిమెడ లక్ష్మీనరసింహారావు వేములవాడలో ఎమ్మెల్యేగా పోటీ చేయడం విడ్డూరమని అన్నారు. ఎందుకంటే కరోనాలో గుర్తుకురాని ప్రజల సేవ ఇప్పుడు గ్రామాల్లో హెల్త్ క్యాంపులు పెడుతూ రాజకీయ లబ్ధి కోసమే కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం లో ఉన్న లేకున్నా ప్రజల మధ్య ఉన్నానని అందుబాటులో ఉండి ప్రజా సేవ చేస్తానని అన్నారు.

# ఘనంగా పోషణ అభియాన్ కార్యక్రమం



**మేడిపల్లి సమ సమాజం::** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ ద్యవనపల్లి అభిలాష్ అధ్యక్షతన పోషణ మాసం 1000 రోజుల కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ అభిలాష్ మాట్లాడుతూ నేటి చిన్నారులే బావి భారత పౌరులు కాబట్టి ఆరోగ్యవంతమైన చిన్నారులు ఉంటే దేశం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీ దశ నుండి ఐదు సంవత్సరముల పిల్లల వరకు అనేక రకాల సేవలను అందిస్తున్నారు, అంగనవాడి సెంటర్ హక్కుదారులు పూర్తిగా వీరి సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరియు పంచాయతీ సెక్రటరీ ఐకెపి వి.ఓ ఏ సభ్యులు గర్భిణీలు బాలింతలు ఇతర తల్లులు అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తా.

**మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) జిల్లా అధ్యక్షులు వేర్పుల మహేందర్.**

**తొర్రూరు సమ సమాజం:** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు అనుబంధం) జిల్లా అధ్యక్షులు వేర్పుల మహేందర్ అన్నారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుండి మున్సిపల్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ కార్మికుల సమస్యలపై స్పందిస్తున్న నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అంకితభావంతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పగలనకా రాత్రనకా కృషి చేస్తానని అన్నారు. వృత్తిపరంగా ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన నాకు తెలియజేస్తే ఆ సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని మున్సిపల్ కార్మికులకు సూచించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడానికి సహకరించిన సంఘం జిల్లా బాధ్యులకు కార్మికులకు జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వార్షికోత్సవ ప్రచార రథాన్ని ప్రారంభించిన చైర్పర్సన్



**జగిత్యాల టౌన్/ పృథ్వి న్యూస్:** శ్రీ లోక మాత పోచమ్మ తల్లి ఆలయ 61వ వార్షికోత్సవం ఈ నెల11 సోమవారం నుండి 14 గురువారం వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవ వేడుకలకు సంబంధించి ప్రచార రథంను శుక్రవారం జగిత్యాల మున్సిపల్ ఇంఛార్జ్ చైర్మన్ గోలి శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం శ్రీ లోక మాత పోచమ్మ తల్లి దేవాలయంలో మున్సిపల్ ఇంచార్జీ చైర్మన్ గోలి శ్రీనివాస్ అమ్మవారుకు ప్రత్యేక పూజలు జరిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కూతురు రాజేష్ , ఆలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, గాజోజి రాజగోపాల్ చారి, రాఘవ చారి, జనగామ గంగాధర్, కొయ్యడ సత్యనారాయణ, రమేష్ , కుమార్, హరి వడ్లురి, ఆలయ పూజారి అంగడి మఠం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు జ్యోతి పాఠశాల విద్యార్థుల ఎంపిక




**జగిత్యాల టౌన్/ సమ సమాజం:**జిల్లా కేంద్రంలోని రాం బజార్ లో గల జ్యోతి హై స్కూల్ విద్యార్థులు ఈనెల 9, 10 ,11 వ తేదీలలో నిర్మల్ జిల్లాలో జరిగే ఆరవ రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు పాఠశాలకు చెందిన బాలికల విభాగంలో శరణ్య ,సంజన, వైష్ణవి, రాగిణి లు బాలుర విభాగంలో రోహిత్, విశ్వ రోహన్, తౌహిద్ లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను జ్యోతి పాఠశాల డైరెక్టర్ బి. హరి చరణ్ రావు గారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు కూడా తగిన ప్రాధాన్యమిచ్చి ఆరోగ్యమును పెంపొందించుకోవాలని అలాగే ప్రతిరోజు కనీసం ఒక గంట పాటు వ్యాయామం తప్పకుండా చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు , అజిత, పి.ఈ.టి లు గౌతమ్, సుభాష్,నిఖిల్ ఉపాధ్యాయుని , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పెంచిన వేతనాలకు బడ్జెట్ విడుదల చేయాలి



**సిఐటియూ జిల్లా కన్వీనర్ సులోచన డిమాండ్**

**జగిత్యాల, సమ సమాజం:**విద్యాశాఖ లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెంచిన వేతనాల చెల్లింపులకు బడ్జెట్ విడుదల చేయించి వేతనాలు చెల్లించాలని అలాగే పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని కోరుతూ సి ఐ టీ యు జగిత్యాల జిల్లా కన్వీనర్ ఇందూరు సులోచన ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన కార్మికులు శుక్రవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఏ.డి ఆకుల శివకృష్ణ కు వినతిపత్రం సమర్పించారు.మధ్యాహ్న భోజనం లో కొత్తమెను పెట్టాలని కార్మికుల పై ఒత్తిడి పెరిగిందని కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటిన నేపథ్యంలో ఇంతవరకు వండిపెట్టిన బిల్లుల డబ్బులు పెండింగ్ లో ఉన్నాయని కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదని కొత్తమెను బడ్జెట్ కేటాయించకుండా వండిపెట్టడం సాధ్యం కాదని కార్మికులు తేల్చిచెప్పారు.అప్పటి వరకు పాత మెనూనే కొనసాగిస్తామని లేదంటే కొత్తమెను ను సవరించాలని కోరుతూ పలు సమస్యలు పరిష్కరించాలని ఈమెరకు వినతిపత్రం లో కన్వీనర్ సులోచన పేర్కొన్నారు. జిల్లా విద్యా శాఖా ఏ.డి ఆకుల శివకృష్ణ స్పందించి తనవంతు బాధ్యతగా మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోతానని తెలిపారు.

# పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుంది

**భీమారం సమ సమాజం:** జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని గోవిందారం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరనలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ నాయక్ మాట్లాడుతూ నేటి చిన్నారులే బావి భారత పౌరులు కాబట్టి ఆరోగ్యవంతమైన చిన్నారులు ఉంటే దేశం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అంగన్వాడి టీచర్స్ తోకల రజీత మాట్లాడుతూ గర్భిణీ దశ నుండి ఐదు సంవత్సరముల పిల్లల వరకు అనేక రకాల సేవలను అందిస్తున్నారు, అంగనవాడి సెంటర్ హక్కుదారులు పూర్తిగా సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మదూకర్ పంచాయతీ కార్యదర్శి ఏఎన్ఎం ఐకెపి వి.ఓ ఏ సభ్యులు గర్భిణీలు బాలింతలు ఇతర తల్లులు పాల్గొన్నారు.

# సీనియర్ న్యాయవాది అక్కెనపల్లి వాసుదేవరావు సేవలు మరువలేని

**- చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నరసింహారెడ్డి**




**చౌటుప్పల్, సమ సమాజం:**ప్రముఖ సీనియర్ న్యాయవాది అక్కెనపల్లి వాసుదేవరావు న్యాయవాదిగా చేసిన సేవలు మరువలేనివని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నరసింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వాసుదేవరావు సంతాప సభ నిర్వహించారు. వాసుదేవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాకిటి నరసింహారెడ్డి మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ప్రముఖ సీనియర్ న్యాయవాది అక్కెనపల్లి వాసుదేవరావు మృతి చెందారన్నారు. ఆయన మృతి న్యాయవాదులకు తీరని లోటన్నారు. న్యాయవాదిగా వాసుదేవరావు చేసిన సేవలను కొనియాడారు. జూనియర్ న్యాయవాదులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాల రమేష్, ఉపాధ్యక్షుడు తాడూరి పరమేష్, ఏపీ అవినాష్, చలపతి, ఏ.శ్రీనివాస్ పి.బిక్షమయ్య, బిక్షపతి, యు.శ్రీనివాస్, జె.రమేష్, మహిపాల్ రెడ్డి, జి.శేఖర్, స్వాతి, వేణు సత్తిరెడ్డి, గంగాదేవి రవీందర్, నరసింహ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సభను జయప్రదం చేయండి

**జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి......**

**జనగాం సమ సమాజం:** తెలంగాణ రైతాంగ సాయుద పోరాట వారోత్సవాల సందర్భంగా ఈనెల 10న పాలకుర్తిలలో జరిగే ప్రారంభ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి కోరారు. శుక్రవారం జఫర్గడ్ మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల నాయకులు వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో నిజం నిరంకుశ రాచరిక పాలనకు వ్యతిరేకంగా దోపిడి క్రీడల నుండి వెట్టిచాకిరికి విముక్తి కల్పించాలని ఆనాడు కమ్యూనిస్టులు వీరోచిత పోరాటాలు నడిపారని అన్నారు. ఆ పోరాటంలో కమ్యూనిస్టులు 4000 మంది ప్రాణా తర్పణం చేసి పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర కమ్యూనిస్టులదని. ఈ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ మతవిద్వేషాలు రెచ్చగొట్టడం కోసం ప్రయత్నం చేస్తుందని దీనిని ప్రజలందరూ ప్రతిఘటించాలని బిజెపి ఆటలు సాగనివ్వొద్దన్నారు. ఈ సభకు సిపిఎం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాపర్తి రాజు నాయకులు నక్క యాకయ్య ఉప్పునూతల మల్లయ్య వేల్పుల రవి ఉప్పునూతల సోమయ్య వేల్పుల పెదరాములు ఎండి శంషోద్దీన్ చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు



# రూ.100 కోట్లతో రోడ్లు అభివృద్ధి చేయాలి

**బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్**

**బీఎస్పీలో భారీ చేరికలు**

**వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించాలని పిలుపు**

**కాగజ్ నగర్ సెప్టెంబర్ 8 : సమ సమాజం:** ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.100 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి కాగజ్ నగర్ పట్టణంలో అధ్వానంగా మారిన రోడ్లను అభివృద్ధి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కాగజ్ నగర్ పట్టణంలోని డా.బి.ఆర్. అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. పట్టణంలో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయని ఆరోపించారు.పట్టణాల్లో,గ్రామాల్లో చిన్నపాటి రోడ్లను కూడా నిర్మించలేని దుస్థితిలో కేసీఆర్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కనీసం రోడ్లను కూడ నిర్మించలేని అసమర్థ కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో గద్దె దిగిపోవాలని ధ్వజమెత్తారు. సిర్పూర్ నియోజకవర్గంలోని రోడ్లన్నీ అద్వాన్న స్థితికి చేరరాయని అన్నారు.రాజీవ్ గాంధీ,అంబేద్కర్ చౌరస్తాలతో పాటు ప్రధాన రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారాయన్నారు.వర్షాలు వస్తే గుంతల మయంగా మారి రోడ్డుపై బస్సులు కార్లు ఆటోలు ద్విచక్ర వాహనాలు వెళ్లలేని దుస్థితి ఏర్పడిందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులు, గర్భిణీలు వెళ్లలేని పరిస్థితులు దాపురించాయని అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల ముందు ఆగమేఘాల మీద వందల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి రోడ్లన్నీ అభివృద్ధి చేసిన కేసీఆర్ కు సిర్పూర్ లో ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. కేవలం ఎన్నికలు వస్తేనే ముఖ్యమంత్రికి అభివృద్ధి గుర్తుకొస్తుందని విమర్శించారు.అనంతరం ఈస్గామ్ లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఈస్గామ్ లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈస్గామ్ వీధులన్నీ జై ఆర్ఎస్పి,జై బీఎస్పీ అంటూ నినాదాలతో హోరెత్తించారు.అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్,రాష్ట్ర కార్యదర్శి సిడెం గణపతి,మాజీ జడ్పీటీసీ పిల్లల తిరుపతి, షేక్ చాంద్ పాష,ముస్తాఫిజ్, మనోహర్, రాంప్రసాద్,ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



## బేజ్జూర్ మండలం వివాహా వేడుకల్లో పాల్గొన్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

సిర్పూర్ నియోజకవర్గం బెజ్జూర్ మండలంలోని ఎల్కపల్లికి చెందిన మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొట్రంగి రామకృష్ణ కుమారుడు వినోద్-కల్యాణీల వివాహా వేడుకలకు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆయన వెంట బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ పార్టీ నాయకులు ఉన్నారు.

## పలుఅభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కొలన్ సుష్మ మహేందర్ రెడ్డి.

**రాజేంద్ర నగర్ సమ సమాజం:** మున్సిపల్ పరిధిలోని శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి జాతర సందర్భంగా జాతర పనులను మరియు నూతన బ్రిడ్జ్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కొలన్ సుష్మ మహేందర్ రెడ్డి , వైస్ చెర్మన్ బండి గోపాల్ యాదవ్ , మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు



# హెూంగార్డు మృతి దురదృష్టకరం

**బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్ సమ సమాజం:**పోలీసు శాఖలో 17 సంవత్సరాలు హెూంగార్డుగా సేవలు అందించిన రవీందర్ ఉద్యోగం రెగ్యులర్ కాదనే మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, మృత్యువుతో పోరాడి మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హెూంగార్డులను రెగ్యులరైజ్ చేస్తానని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి హామీని అమలు చేయలేదన్నారు. నిజంగా ముఖ్యమంత్రి హామీ అమలైతే హెూంగార్డ్ రవీందర్ బ్రతికి ఉండేవాడని పేర్కొన్నారు. హెూంగార్డుల కష్టాలు, కన్నీళ్లు నియంత పాలకులకు పట్టవని తక్షణమే ప్రభుత్వం మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి, ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఐపీఎస్ అధికారిగా, మీ కుటుంబంలో ఒకడిగా చెబుతున్నా.. రాష్ట్రంలో హెూంగార్డులు ఎవ్వరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, పోరాడి హక్కులు సాధించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో 20,000 మంది హెూంగార్డుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా హెూంగార్డుల పక్షాన బీఎస్పీ పోరాడుతుందన్నారు.

# సీసీ రోడ్లు త్వరగా పూర్తి చేయాలి

**మహేశ్వరంసమ సమాజం:** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని 4వ డివిజన్ షిరిడీ సాయి నగర్ లో ఈరోజు సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించిన .టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మరియు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ రెడ్డి . అనంతరం కాలనిలో పర్యటించి కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు నిర్మాణము త్వరితగతిన పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులో ఉండేలా చూడలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, ఏఈఈ వినీల్ గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## రెండవ విడత డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిని

**హెూమ్ మంత్రి మహమూద్ అలీ,మంత్రి సబితా ఇంద్రా రెడ్డి తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్ర నగర్సమ సమాజం:** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో, మంత్రి కేటీఆర్ అధ్యక్షతన జరిగిన రెండు పడకల గదుల ఇండ్ల సమీక్షా సమావేశంలో హెూమ్ మంత్రి మహమూద్ అలీ,మంత్రి సబితా ఇంద్రా రెడ్డి తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ . మొదటి దఫా రెండు పడకల గదుల ఇండ్లు పంపిణీ చేసిన విధంగానే, రెండవ విడత కూడా ఈనెల 15న జిల్లా కలెక్టర్ ల ఆధ్వర్యంలో లక్కీ డ్రా దార లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని వాటిని 21వ తేదీ లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో %మీూా% లు అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, సుధీర్ రెడ్డి,రాజాసింగ్,మాగంటి గోపినాథ్, కాలేరు వెంకటేష్,జిల్లా కలెక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు

## పలువురి కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శ



**శాలిగౌరారంసమ సమాజం:** శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి బి. ఆర్.ఎస్ మండల నాయకులు దుబ్బ వెంకన్న తండ్రి దుబ్బ సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు.ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు.అదే విధంగా ఈ రోజు అదే గ్రామానికి చెందిన శెగ్గం శంకర్ మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందగా వారి తల్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి,వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,తెలంగాణ ఉద్యమకారులు,కొండారం గ్రామస్తులు,వేముల వీరేశం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కోలాటం మహిళలకు ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే పైళ్లా



**వలిగొండ సెప్టెంబర్ 8సమ సమాజం:** :మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన కోలాటం మహిళలకు భువనగిరి శాసన సభ్యులు ఫైళ్ల శేఖర్ రెడ్డి సమకూర్చిన 20000 ( ఇరవై వేల) రూపాయలను గురువారం బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మాద లావణ్య శంకర్ గౌడ్,రేపాక సందీప్ రెడ్డి,గ్రామశాఖ అధ్యక్షుడు సిరికొండ జహంగీర్,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందుల శ్రీను,ప్రధాన కార్యదర్శి కందుల మహేష్,కందుల ప్రవీణ్,బోనాల చంద్రమౌళి,కోలాటం మహిళలు సుక్క నిర్మల, కందుల కమలమ్మ, సునిత, రాణి, మమత, భాగ్యమ్మ, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారం గ్రామం లో కారం మిల్లు ను ప్రారంభించిన బి. ఆర్. ఎస్ నాయకులు

**అడ్డగూడూర్ సమ సమాజం:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలం ధర్మారం గ్రామం లో BRS సెర్ఫ్ గారి ఆర్థిక సహకారం 4,00,000 లక్షల తో స్వరూప లోన్ కింద మంజూరు అయినా ఉప్పలమ్మా తల్లి కారం మిల్లు ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన %వీూా% దర్శనాల అంజయ్య, జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి అయోధ్య, చిప్పలపెల్లి మహేంద్ర నాథ్ చైర్మన్ మార్కెట్ కమిటీ మాజీ,పొన్నాల వెంకటేశ్వర్లు చైర్మన్ BRS అడ్డగూడూర్,పూలపెల్లి జనార్ధన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ అడ్డగూడూర్, BRS చంద్రమౌళి, BRS ప్రేమలత BRS వెంకటేశ్వర్లులి, యాదగిరి,సెక్రటరీ అనిత.ధర్మారం సర్పంచ్ శీలం జ్యోతి దావీద్‌లి,ఉప సర్పంచ్ మేకల సుజాత జగన్, మానాయికుంట గ్రామ మాజీ సర్పంచ్ కడారి సైదులు, బాలెంల అరవింద్ BRSV తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, పయ్యావుల రమేష్ BRS అడ్డగూడూర్ అధ్యక్షులు,గూడెపు నరేష్ అడ్డగూడూర్ పట్టణ అధ్యక్షులు, BRS పార్టీ మండల యువ నాయకులు బాలెంల నరేందర్,BRS నాయకులు లాదినేని వెంకన్న,ధర్మారం మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు తాడోజు లక్ష్మణాచారి ,BRS మండల నాయకులు మేకల ప్రవీణ్‌లి. ప్రశాంత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at Panidhar PUBLICATIONS. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU, RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in